కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఎపి టెట్)-2024 నాలుగో రోజు ప్రశాంతంగా సాగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో, సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 256 మందికి 204 మంది హాజరవ్వగా 52 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 286 మందికి 254 మంది హాజరవ్వగా 32 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ధరల మంట..నాణ్యత చింత..!

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

సొమ్ము వెచ్చిస్తున్నా దొరకని నాణ్యమైన సరుకులు

రైతుబజార్లలో నాణ్యత లేని కూరగాయలతో జనం అవస్థలు

ఏలూరు వన్‌టౌన్ రైతుబజార్‌లో పరిస్థితి మరింత అధ్వానం

కొరవడిన మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ



ఏలూరు వన్‌టౌన్ రైతుబజార్‌లో నాణ్యతలేని ఉల్లిపాయలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ముఖ్యమైన కూరగాయల ధరలు కిలో రూ.50 నుంచి రూ.70 వరకూ పలుకుతున్నాయి. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్నవారు వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేయాలంటే గతంలో ఎన్నడూ లేనివిధంగా కనీసం రూ.800 నుంచి రూ.వెయ్యి వెచ్చించాల్సిన పరిస్థితి. దీంతో నెలకు రూ.నాలుగు వేలు కూరగాయల కొనుగోలుకే చేయాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో సామాన్య ప్రజానీకం కూరగాయలు కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్న పరిస్థితి. ఉల్లి నుంచి టమోటా వరకూ అన్ని కూరగాయల ధరలు భారీగా పెరగడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్న కూరగాయలు సరైన నాణ్యత లేకపోవడంతో జనానికి ఏం చేయాలో అర్థంకాక సతమతమవుతున్నారు. బహిరంగ మార్కెట్లతోపాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రైతుబజార్లలోనూ నాణ్యత లేని కూరగాయలు విక్రయిస్తుండటంపై వినియోగదారులు తీవ్ర ఆవేదనకు గురవు తున్నారు. కూరగాయల ధరలు ఆకాశాన్నం టడంతో ఎంతోకొంత ధర తక్కువతోపాటు, నాణ్యమైన సరుకు దొరుకుతుందని జనం ఆశగా రైతుబజార్లకు వెళ్తున్నారు. అక్కడ నాణ్యత లేని కూరగాయలు చూసి జనం నోరెళ్లబెడుతున్నారు. ఏలూరు నగరంతోపాటు అనేక పట్టణాల్లో రైతుబజార్లు కొనసాగుతున్నాయి. ఏలూరు వన్‌టౌన్‌లో ఒకటి, టుటౌన్‌లోని పత్తేబాద్‌లో మరొక రైతుబజార్ ఉన్నాయి. నగరవాసులంతా ఎక్కువగా ఈ రైతుబజార్లలోనే కూరగాయలు కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉంది. వన్‌టౌన్ రైతుబజార్‌లో కూరగాయల నాణ్యత అనేది అత్యంత దారుణంగా ఉంటుందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. కిలో ఉల్లిపాయలు రూ.56 వసూలు చేస్తున్నా కనీస నాణ్యత లేకపోవడం గమనార్హం. కిలో ఉల్లి మంచివి తీసుకోవాలంటే ఏరుకోవడానికి కనీసం అరగంట సమయం పడుతోంది. వినియోగదారులంతా ఆదివారం రైతుబజార్లకు ఎక్కువగా వస్తుంటారు. తాజా, నాణ్యమైన కూరగాయలు దొరుకుతాయని జనం ఆశిస్తారు. వన్‌టౌన్ రైతుబజార్‌లో ఆదివారం సైతం నాణ్యమైన, తాజా కూరగాయలు దొరకని పరిస్థితి నెలకొంది. అదేమని అడిగితే సరైన సమాధానం చెప్పని పరిస్థితి. కూరగాయలు వడలిపోయి, నాణ్యత లేకుండా ఉండటంతో జనం ఈ రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు విముఖత చూపుతున్నారు. ఇక్కడ ఎస్టేట్ ఆఫీసర్ ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది. ఉల్లి, టమోటా, క్యారెట్, బెండ ఇలా ఏఒక్క కూరగాయ నాణ్యత లేని పరిస్థితి. పత్తేబాద్ రైతుబజార్‌లో కొంతమెరుగ్గా ఉన్నప్పటికీ నాణ్యమైన కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆదివారం రైతుబజార్‌లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	ధర (కిలో)
అల్లం	150
టమోటా	74
కాప్సికం	70
వంకాయ	54
ఉల్లి	56
క్యారెట్	58
కాకర	50
దొండకాయ	60
చేమదుంప	48
బీర	54
దోస	40
బంగాళ దుంప	40
గోరుచిక్కుళ్లు	44
ఆనబకాయ ఒకటి	50
పొట్లకాయ ఒకటి	25
బెండకాయలు	38
పచ్చిమిర్చి	32

ధరల మంటతో విలవిల

కూరగాయల ధరలు పెరుగుతున్న తీరు జనాల్ని హడలెత్తిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ధరలను అదుపు చేస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. కిలో ఉల్లి ధర బహిరంగ మార్కెట్లో రూ.60 వరకూ పలుకుతోంది. నలుగురు సభ్యులున్న కుటుంబానికి తక్కువగా లెక్కించినా వారానికి రెండు కిలోలు అవసరం పడతాయి. ఉల్లిపాయల కోసం వారానికి ఏకంగా రూ.120 ఖర్చు పెట్టాల్సి వస్తోంది. గతంలో ధరలు పెరిగినప్పుడు సబ్సిడీపై ఉల్లిపాయలను ప్రభుత్వం అందించేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి సైతం లేకుండాపోయింది. కిలో కూరగాయలు కొనుగోలు చేసేవారు ధరల పెరుగుదలతో అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. దీంతో పోషకాహార లోపం ఏర్పడి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. నిమ్మకాయల ధరలు సైతం రైతు వద్ద కొనుగోలు చేస్తున్న ధరకు, వినియోగదారుడికి విక్రయిస్తున్న ధరకు సంబంధం లేకుండా పోయింది. ఏదేమైనా ఒకపక్క ధరల మంట, మరోపక్క నాణ్యతలేని కూరగాయలతో జనం విలవిల్లాడుతున్నారు.

ధ్వంసమైన రోడ్డుకు మర్మతులు చేస్తున్న కూలీలు

ఏడు నెలలకే తారురోడ్డు ధ్వంసం

నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలే కారణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు-దూబచర్ల రహదారిలో ఈ ఏడాది మార్చిలో కొత్తగా తారు రోడ్డు నిర్మాణం చేశారు. రోడ్డు నిర్మించి ఏడు నెలలలోపే పలు చోట్ల రోడ్డు కుంగి తారు పగిలి గోతుల్లా మారుతున్నాయి. ఎన్నికలకు ముందు హడావిడిగా సరైన అధికారుల పర్యవేక్షణ లేకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్డు వేయడం వల్లే దెబ్బతిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నాణ్యమైన మెటీరియల్‌తో మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పండుగ సెలవులకు ఊళ్లకు వెళ్లే ప్రజలు తాము వేరొక ప్రాంతానికి వెళుతున్న సమాచారాన్ని పోలీసులకు అందిస్తే వారి ఇళ్లకు కాపలా ఏర్పాటు చేస్తారని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దసరా సెలవులు నేపథ్యంలో ప్రజలు వేరే ప్రాంతాలకు వెళ్తుంటారని, ఆ సమయంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా పోలీసు శాఖ ఆయా ఇళ్లకు కాపలా ఏర్పాట్లను సీసీ కెమెరాల ద్వారా ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. వేరే ఊరు వెళ్లేవారు 112 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న ఎఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పిగా నక్కా సూర్యచంద్రరావు సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన నియమితులయ్యారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పిగా గతంలో ఏలూరు జిల్లాలో పనిచేశారు. సెబ్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత ప్రస్తుతం ఆయన సిఐడిలో అటాచ్‌మెంట్‌లో ఉన్నారు. అక్కడ నుండి ఏలూరు జిల్లా ఎఎస్‌పిగా బదిలీ అయ్యారు.

యుటిఎఫ్ పోటీల్లో జిల్లా ఉపాధ్యాయుల విజయకేతనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 4, 5, 6 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో ఏలూరు జిల్లా ఉపాధ్యాయులు విజయకేతనం ఎగరవేశారు. మహిళల విభాగంలో 45 సంవత్సరాలలోపు వారిలో వంద మీటర్ల రన్నింగ్, 200 మీటర్ల రన్నింగ్‌లో పద్మ జయలక్ష్మి మొదటి స్థానం సాధించారు. 400 మీటర్ల వాకింగ్‌లో జె.సుధారాణి మొదటి స్థానం సాధించారు. 45 సంవత్సరాలు పైబడిన వారి గ్రూపులో 100 మీటర్ల రన్నింగ్‌లో ఎన్.పుష్పలత రెండో స్థానం, 400 మీటర్ల వాకింగ్‌లో పి.రాజేశ్వరమ్మ మొదటి స్థానం, క్యారమ్స్ డబుల్స్‌లో ఎస్.సుధారాణి, కె.రామలక్ష్మి రెండో స్థానం, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఎన్.విజయశాంతి రెండో స్థానం, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఎం.విజయశాంతి, ఎం.రామ తులసి రెండో స్థానం, టెన్నికాయిట్‌లో ఎన్.విజయశాంతి, ఎం.రామ తులసి, యు.సరళ మొదటి స్థానం, వాలీబాల్‌లో పి.పద్మ, జయలక్ష్మి, ఎం.విజయశాంతి బృందం రెండో స్థానంలో నిలిచి స్వర్ణ, రజత పతకాలు సాధించారు. అలాగే పురుషుల విభాగంలో 45 సంవత్సరాల్లోపు వారిలో 200 మీటర్ల రన్నింగ్‌లో ఇ.ఆనంద్ రెండో స్థానం, జావలిన్ త్రోలో కె.భీమరాజు రెండో స్థానం, 45 సంవత్సరాలు పైబడిన వారి గ్రూపులో వంద మీటర్ల రన్నింగ్ జి.రామారావు రెండో స్థానం, 400 మీటర్ల వాకింగ్‌లో జి.రామారావు మొదటి స్థానం షాట్‌పుట్‌లో టి.మల్లయ్య మూడో స్థానం, జావలిన్‌లో టి.మల్లయ్య రెండో స్థానం, స్లో సైక్లింగ్లో ఆర్.రవికుమార్ రెండో స్థానం, క్రికెట్‌లో ఎండి.ముషబ్బర్ బృందం విజేతలుగా నిలిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ ఆటల పోటీలకు జిల్లా నుండి 100 మంది పైబడి గుంటూరులో పాల్గొన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్.స్వర్ణ రేఖ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జి.గంగేయుడు, నేతలు పాల్గొన్నారు. విజేతలకు పిడిఎఫ్ ఎంఎల్‌సి కె.లక్ష్మణరావు, రాష్ట్ర నాయకత్వం చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు బహుకరించారు. వీరందరికీ రాబోయే రాష్ట్ర మహాసభల్లో బహుమతులు అందజేస్తారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, ఆర్.రవికుమార్ తెలిపారు. రాష్ట్రంలోనే అన్ని జిల్లాల కంటే అత్యధికంగా విజేతలుగా నిలిచి మెడల్స్ సాధించిన ఏలూరు జిల్లా ఉపాధ్యాయులకు యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నేతలు అభినందనలు తెలిపారు.

విజేతలతో ఎంఎల్‌సి లక్ష్మణరావు, యుటిఎఫ్ నేతలు

ముమ్మరంగా నరసన్నపాలెం- వేదాంతపురం రోడ్డు పనులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎట్టకేలకు నరసన్నపాలెం-వేదాంతపురం-ధర్మారావుపేట గ్రామాల నడుమ ప్రధాన రహదారి పనులు ప్రారంభమయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ వల్ల ఈ పనులు గతంలో నిలిచిపోయాయి. దీంతో కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఏడు కిలోమీటర్ల మేర చేపట్టే రహదారి అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.3.10 కోట్ల నాబార్డు నిధులతో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనుల్లో రామానుజపురం గ్రామంలో సుమారు కిలోమీటర్ మేర, నరసన్నపాలెం, వేదాంతపురం గ్రామాల్లో అర కిలోమీటర్లు చొప్పున సీసీ రోడ్లు నిర్మించనున్నారు.

సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

విలీనమై పదేళ్లు దాటినా మారని పిన్‌కోడ్..!

కుక్కునూరు మండలవాసులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటింది. ఆ సందర్భంగానే ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కలిపి ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి తీసుకొచ్చారు. జిల్లా మారింది.. రాష్ట్రం మారిందిగానీ ఇప్పటికీ కుక్కునూరు మండలంలో తెలంగాణా పిన్‌కోడ్ సీరియల్ కొనసాగుతుండటం అక్కడి ప్రజలు ఇబ్బందికరంగా మారింది. వివరాల్లోకెళ్తే ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన తర్వాత కొత్త పోస్టల్ పిన్‌కోడ్ 534444 కేటాయించారు. ఇంతవరకూ బాగానే ఉంది. కొత్త రాష్ట్రం, కొత్త జిల్లా, కొత్త పిన్‌కోడ్ నెమ్మదిగా అలవాటవుతుందిలే అని అక్కడి ప్రజలు భావించారు. అయితే విభజన జరిగి పదేళ్లు దాటింది. ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి ఏలూరు జిల్లాలో కుక్కునూరు మండలం ఉంది. అయినప్పటికీ ఇప్పటికీ కొత్త పిన్ కోడ్ ఎక్కడ ఉపయోగించాలన్నా ఆన్‌లైన్‌లో ఎక్కడా కానరాకపోవడం సమస్యలకు తావిస్తోంది. దీంతో దిక్కుతోచని స్థితిలో పాత పిన్‌కోడ్ 507114పైనే ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇతర పనులు అక్కడి ప్రజలు సాగిస్తున్నారు. ఆన్‌లైన్ పనులన్నింటికీ పిన్‌కోడ్ ఇబ్బంది తప్పడం లేదు. దీంతో పాత పిన్‌కోడ్ 507114 రాసి వయా బూర్గంపాడు, కుక్కునూరు అని రాస్తేనే పనులు సాగుతున్నాయి. ఇంతకీ బూర్గంపాడు మండలం తెలంగాణాలో ఉండటం విశేషం. దీనిపై పోస్టల్‌తోపాటు సంబంధిత అధికారులు స్పందించి కుక్కునూరు ప్రజలకు కొత్త పిన్‌కోడ్‌తో గుర్తింపు దక్కేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాగు ఖర్చు తగ్గించేందుకు ప్రత్యేక కృషి

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రైతులకు సాగు ఖర్చు తగ్గించి మంచి దిగుబడులు సాధించేలా కృషి చేస్తామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ తెలిపారు. వేసవిలో మట్టి నమూనా పరీక్షల ద్వారా వ్యవసాయాధికారుల సూచనల మేరకు తగు మోతాదులో ఎరువులు వాడితే అధిక దిగుబడులు వస్తాయన్నారు.

ప్రశ్న: నూజివీడు డివిజన్‌లో సాగు విస్తీర్ణం ఎంత?

నూజివీడు డివిజన్లో ఖరీఫ్-2024లో 31,621 ఎకరాల సాగు విస్తీర్ణణానికిగాను సాగు చేసింది 26,339 ఎకరాలు.

ప్రశ్న: సాగులో ఉన్న పంటల వివరాలు?

వరి, పత్తి, మినుము, వేరుశెనగ, చెరకు, వరి 22,626 ఎకరాలు, మినుము 416 ఎకరాలు, పత్తి 985 ఎకరాలు.

ప్రశ్న: అన్నదాత సుఖీభవ విధివిధానాలు ఏంటి?

అన్నదాత సుఖీభవ విధివిధానాలు ఇంకా రాలేదు. వారం, పది రోజుల్లో వస్తాయని సమాచారం. రాగానే తెలియజేస్తాను.

ప్రశ్న: వ్యవసాయ యాంత్రీకరణలో ఏయే పరికరాలు ఇస్తున్నారు. ఎంత సబ్సిడీ ఇస్తున్నారు?

వ్యవసాయ యాంత్రికరణలో డ్రోన్స్ ఇస్తున్నాం. 90 శాతం సబ్సిడీతో చాట్రాయి మండలంలో ఒకటి, నూజివీడు మండలంలో ఒకటి ఇచ్చాం.

ప్రశ్న: నూజివీడు డివిజన్‌లో ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు దుకాణాలను ఎప్పుడు తనిఖీ చేస్తారు?

ప్రతి సీజన్‌కు ముందు ఒకసారి తనిఖీ చేస్తాము సంబంధిత మండల వ్యవసాయ అధికారి ఎరువులు, పురుగుమందులు విత్తనాలు నాణ్యత నిమిత్తం ప్రభుత్వంచే ఆమోదించబడిన లేబరేటరీకి పంపి నాణ్యత నిర్ధారిస్తాం. ఇందులో నాణ్యతా ప్రమాణాలు పాటించని డీలర్లను, తయారు చేసే కంపెనీలపై సంబంధిత కోర్టులో క్రిమినల్ కేసులు వేస్తాం.

ప్రశ్న: కౌలు రైతులకు కార్డులను భూయజమాని సంతకంతో ఇస్తున్నారు. భూయజమానులు ఎక్కువ శాతం సంతకాలు చేయడం లేదు దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారా?

ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఎపి కౌలురైతుల సంఘం కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. రబీ సీజన్ నుండి మండల వ్యవసాయ అధికారి సిఫార్సు మేరకు కౌలు రైతులకు కార్డులు జారీ చేస్తాం.

ప్రశ్న: నూజివీడు డివిజన్లో ఎన్ని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలు ఉన్నాయి?

నూజివీడు డివిజన్లో ఎరువుల దుకాణాలు 88, పురుగుమందుల దుకాణాలు 98, విత్తనాల దుకాణాలు 48 ఉన్నాయి.

ప్రశ్న: వరి పంట రైతులకు గిట్టుబాటు కావడం లేదు అంటున్నారు, వారికి ఎలాంటి సూచనలు ఇస్తారు?

వరి సాగు ఖర్చు పెరగటం వల్ల, అధిక ఎరువులు అవసరానికి మించి వాడటం వల్ల ఇబ్బంది వస్తోంది.

ప్రశ్న: రైతులకు వ్యవసాయం గిట్టుబాటు ఉండాలంటే ఎలాంటి సలహాలు ఇస్తారు?

రైతులు సాగుకు వ్యవసాయ ఉపకరణాలను ఉపయోగించుకొని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు మేరకు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు వచ్చి రైతుకు గిట్టుబాటుగా ఉంటుంది

నో శాండ్.. కిక్కు మాత్రం రెడీ..!

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు దాటింది. సమస్యల పరిష్కారం, సూపర్ సిక్స్ అమలుపై జనం అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే అధికారపక్ష నేతలు మాత్రం అధికారం చేతికొచ్చిన కిక్ అనుభవించాలనే ఆత్రుతతలో ఉన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి చెబుతున్న అంశాలు తప్ప స్థానిక సమస్యలపై ప్రజాప్రతినిధుల మాటలు తప్ప చేతలు ఉండటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఎంఎల్ఎలు మినహా మిగిలిన వారంతా తమ వారికి నామినేటెడ్ పదవుల కోసం, ఆదాయం ఆర్జనపైనే ఎక్కువ దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు ఇసుక సమస్యతో సతమతమవుతున్నారు. ఉచిత ఇసుక అందితే తమ కష్టాలు గట్టెక్కుతాయని నిర్మాణదారులంతా ఆశగా ఎదురుచూడగా తమకు పనులు దొరుకుతాయని భవన నిర్మాణ రంగ కార్మికులంతా సంతోషించారు. అయితే ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా ఉచిత ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుందామంటేనే 'నో శాండ్' అని రావడంతో నిర్మాణదారులు కంగుతిన్నారు. ఇప్పటికే ఇల్లు నిర్మించాలంటేనే తడిసి మోపెడు కావడం, పైగా ఇసుక దొరకకపోవడంతో పనులు నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనివల్ల సిమెంట్ గడ్డకట్టడం, ఐరన్ దెబ్బతినడంతోపాటు ఇంటి అద్దెలు చెల్లించాల్సి రావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని లబోదిబోమంటున్నారు. గత వేసవిలోనూ ఇసుక విషయంలో అదే పరిస్థితి ఎదురైంది. అయితే ధర ఎక్కువైనా ఇసుక దొరికేది. పేరుకే ఉచిత ఇసుక అయినా ఆన్‌లైన్ బుక్ చేసుకుంటే ఇంటికి ఇసుక చేరుకునేసరికి పాత ధరే పలుకుతోందని పలువురు చెబుతున్నారు. ఇప్పుడు అసలు ఇసుకే బుకింగ్ చేసుకోవడానికి కుదరకపోవడంతో బ్లాక్‌లో గత ధరకన్నా సుమారు 50 శాతం అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని బడా నిర్మాణదారులు చెబుతున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలైతే పనులు ఆపేసి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ కోసం కుస్తీ పడుతున్నారు. ఇదే సమయంలో భవన నిర్మాణ కార్మికులు మాత్రం పనుల్లేక అర్థాకలితో అలమటించాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం. ఉచిత ఇసుక బుకింగ్ అంటూ హడావుడి చేసిన జిల్లా అధికారులైతే ఇసుక కొరతపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఏదోక రూపంలో ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని, బ్లాక్‌లో విక్రయాలను అరికట్టాలని జనం కోరుతున్నారు.

మద్యం పాలసీ జిల్లాలోని ప్రజాప్రతినిధులకు మంచి కిక్కునిస్తోంది. మద్యం దుకాణాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుండగా 11న మద్యం దుకాణాల లాటరీ నిర్వహించి దుకాణదారులను ప్రకటించనున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది. అయితే మద్యం దుకాణాలకు టెండర్లు వేసేవారు తొలుత ఆయా ప్రాంత ఎంఎల్ఎల అనుమతి తీసుకుని ఒప్పందం కుదుర్చుకున్నాకే ముందుకెళ్లాల్సిన పరిస్థితి పలు నియోజకవర్గాల్లో కన్పిస్తోంది. ఒకవేళ ఎంఎల్ఎలను సంప్రదించకుండా టెండరు వేస్తే ఆ విషయం తెలుసుకుని సదరు టెండరుదారుడిని వెంటనే ఆయా ఎంఎల్ఎల అనుచరులు పిలిచి హెచ్చరిస్తున్నారు. దీంతో తమకే దుకాణం ఖరారైతే ఎంఎల్ఎకు ఇచ్చే వాటాపై ఒప్పందం కుదుర్చుకోక తప్పని పరిస్థితి. మద్యం దుకాణదారు 50 శాతం వరకూ సొమ్ము ఎంఎల్ఎలకు ముట్టజెప్పాలని ఆయా ఎంఎల్ఎల కుటుంబ సభ్యులు నేరుగా మద్యం దుకాణాల టెండర్లు వేస్తున్నవారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగడంతోపాటు బెల్ట్‌షాపులు యథేచ్ఛగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీనిపై అటు ఎక్సైజ్, ఇటు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నోరు మెదిపే పరిస్థితి దాదాపు శూన్యమని వాటాల పంపకం బట్టి అర్థమవుతోంది. అంటే మరికొద్ది రోజుల్లో మందుబాబుల వీరంగం ప్రారంభమవుతుందనే చెప్పొచ్చు. దీనిపై ప్రజల నుంచి సైతం ఆగ్రహజ్వాలలు ఎగిసే అవకాశం ఉంది.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

మండల పరిషత్‌కు మంచి గుర్తింపు తేవాలి: ఎంపిపి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణను నూతన ఎంపిడిఒ యద్దనపూడి రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ మండల పరిషత్‌కు మంచి గుర్తింపు వచ్చేలా అధికారులు, సిబ్బంది తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. క్రమశిక్షణతో మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమయ పాలనతో ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి మండలాన్ని మరింత ముందుకు నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎంవి.రమణరావు, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ నుంచి విముక్తి కల్పించండి..!

ఆమె వేధింపులు భరించలేకున్నాం
అంగన్‌వాడీల ఆవేదన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎ.నయోమిరాణి అరాచకాలకు అంతులేకుండా పోతుందని, తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవులు, సెంటర్ సందర్శనలు, ఈవెంట్‌లు ఇలా ప్రతిదానికీ ఆమె డబ్బులు వసూలు చేస్తుందని, డబ్బులు ఇవ్వకపోతే ఘాటు పదజాలంతో దుర్భాషలాడుతూ బెదిరిస్తోందని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తనకు అధికారులు, నాయకులు తెలుసని, ఉద్యోగాలు ఊడదీస్తానంటూ భయభ్రాంతులకు గురిచేస్తోందని వాపోతున్నారు.

సూపర్‌వైజర్‌కు కొయ్యలగూడెం సెంటర్-128 వర్కర్ ఎస్‌కె.నూర్జహాన్ తొత్తుగా మారి సెంటర్ విజిట్ చేసే ముందే ఆమె ద్వారా డిమాండ్ లిస్ట్ ఇస్తుందని, నూర్జహాన్ గతంలో ఉద్యోగం కూడా పోగొట్టుకుందని వర్కర్లు చెబుతున్నారు. నూర్జహన్ సెంటర్‌లో ఉండదని, ఎప్పుడూ సూపర్‌వైజర్ చుట్టూ తిరిగుతూ ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి.

అంగన్వాడీ టీచర్లు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి చాలీచాలని జీతాలతో కష్టపడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లల బాగోగులు చూసుకుంటూ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఒత్తిడితో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సూపర్‌వైజర్ వేధింపులు మరింత భారంగా మారాయని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

సూపర్‌వైజర్ ఎ.నయోమిరాణి సెంటర్ సందర్శనకు వస్తే రూ.వెయ్యి, సెలవు కావాలంటే రూ.500, ఈవెంట్ అంటే రూ.వెయ్యి ఇలా ప్రతిదానికీ డబ్బులు వసూలు చేస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా ఆమెకు నచ్చినట్లు వంటలు వండిపెట్టాలని, పండ్లు, కూరగాయలు, చిరుతిళ్లు తీసుకురావాలని, ఇవన్నీ చేయకపోతే అవమానపరుస్తూ మానసిక క్షోభకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొయ్యలగూడెం సెక్టార్‌లో 27 మంది అంగన్వాడీ టీచర్లు ఉన్నామని, మేమంతా సూపర్‌వైజర్ దోపిడీకి గురవుతున్నామని వారు వాపోతున్నారు.

సెంటర్ విజిట్‌కు వస్తే డబ్బులు ఇవ్వాలి
బొడిగూడెం అంగన్వాడీలు జ్యోతి, సునీత

సూపర్‌వైజర్ సెంటర్ విజిట్‌కు వచ్చినప్పుడు వంట ఆమెకు నచ్చినట్టు వండాలి. రూ.వెయ్యి ఇవ్వాలి. చీర, పండ్లు ఇవ్వాలి. ఆమె కోసం కార్యాలయానికి వెళ్తే వట్టి చేతులతో వెళ్లకూడదు. ఈవెంట్స్ జరిగినప్పుడు కూరగాయలు, ఆకు కూరలు, పూలు ఇవ్వాలి. సెలవు అడిగితే రూ.500 ఇవ్వాలి. ఈవెంట్స్ జరిగినప్పుడు గ్రామ పెద్దల ముందు అత్యంత పౌరుష పదజాలంతో మాట్లాడుతుంది. ఈవెంట్స్ డబ్బులు పడితే సగభాగం అవిడికే ఇవ్వాలి. ఇవి ఇవ్వకపోతే మానసిక క్షోభకు గురిచేస్తుంది.

వేధింపులకు గురి చేస్తుంది
మంగపతిదేవిపేట అంగన్‌వాడీలు
శాలిని, డి.భవాని, కె.ధనలక్ష్మి

ఆమె కోసం ఆఫీసుకు వెళ్లినప్పుడు ఆమె చెప్పినవి తీసుకెళ్లకపోతే అధికారుల ముందు దుర్భషలాడుతుంది. గంటల కొద్దీ అక్కడే కూర్చోబెడుతుంది. వర్కర్, హెల్పర్స్‌ను వేధింపులకు గురి చేస్తుంది. అధిక ఖర్చు వల్ల మా కుటుంబంలో అనేక గొడవలు జరుగుతున్నాయి.

అందరి ముందు బూతులు తిడుతుంది
కన్నాపురం అంగన్‌వాడీలు కె.మరియమ్మ,
పి.దేవికుమారి, వి.వరలక్ష్మి, పి.శారద, ఎం.ప్రభావతి

ప్రతి రోజూ బండి మీద దింపాలి. సెంటర్‌కు వస్తె కోడి మాంసం పెట్టాలి. వెళ్లేటప్పుడు కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు ఇవ్వాలి. లోటు జరిగితే దుర్భషలాడుతుంది. ఈవెంట్స్‌కు వచ్చిన సమయంలో తల్లుల ముందు చెప్పరాని బూతులతో తిడుతుంది. ఆమెను ఇక్కడి నుంచి పంపించేయాలి.

మానసిక క్షోభకు గురి చేస్తుంది
అంకాలగూడెం అంగన్‌వాడీలు జె.గంగాదేవి,
టి.జయప్రద, ఎం.శివరత్నకుమారి

ఏ సెంటకోచ్చినా రూ.వెయ్యి ఇవ్వాలి. డబ్బులు లేకపోయినా అప్పటికప్పుడు అప్పు చేసి ఇవ్వాలి. మాటలతో మానసిక క్షోభకు గురిచేస్తుంది. ప్రతి ఈవెంట్‌కు రూ.వెయ్యి నుంచి ఎంతైనా తీసుకుంటుంది. గౌరవ ప్రదమైన మాటలు మాట్లాడదు. మాకు ఈ బాధల నుంచి విముక్తి కావాలి.

ఆమె నుంచి మమ్మల్ని రక్షించండి
కొయ్యలగూడెం సెక్టార్ కె.కృష్ణవేణి

బార్కెట్ నగర్ సెంటర్ అంగన్వాడీ లక్ష్మి, బుల్లెంపేట నాగరత్నం, రేపల్లేవాడ శ్రీలత అందరూ సూపర్‌వైజర్ బాధితులే. ఆమె నుంచి విముక్తి కలిగినప్పుడు ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలం. ఆమె నుంచి మమ్మల్ని రక్షించాలని ఉన్నతాధికారులను కోరుతున్నాం.

రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
కొయ్యలగూడెం అంగన్‌వాడీలు శ్రీదేవి, నాగవేణి

మేము ఈ ఉద్యోగంలో సంపాదించే దానికన్నా అదనంగా ఖర్చు పెట్టేది ఎక్కువ. ఇంటి దగ్గర ఈ విషయంపై అనేక గొడవలు జరుగుతున్నాయి. మేము ఆఫీసుకు వెళ్లినా, ఆమె సెంటర్‌కు వచ్చినా, ఆమె పుట్టినరోజు అయినా, మాది పెళ్లి రోజు అయినా, ఎవరిది అయినా ఫంక్షన్ జరిగిన సెంటర్స్‌లో, ఈవెంట్స్ జరిగినా ఏదైనా ఆమెకు డబ్బులు ఇవ్వాలి. ఎదురు తిరిగి అడిగితే అభ్యంతరకరమైన పదజాలంతో దూషణలకు దిగుతుంది. రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

ఆమె నుంచి విముక్తి కల్పించాలి
కన్నాపురం, కొయ్యలగూడెం అంగన్‌వాడీలు
వి.విజయకుమారి, నాగజ్యోతి

మా అందరిదీ ఒకటే వేదన, ఒకటే రోదన. ఆమె మాకు వద్దు. ఆమె పెట్టే బాధలు మేము భరించలేం. ఆమె నుంచి మాకు విముక్తి కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

స్ఫూర్తివంతమైన సేవలతోనే సమున్నత విలువలు

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్ఫూర్తివంతమైన సేవలే సమాజంలో సమున్నత విలువలను పెంపొందిస్తాయని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఫ్లాష్ సంస్థ సభ్యులు విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సరికొత్త ఆలోచన చేశారు. ఇందులో భాగంగా కలయిక, సమతా సైనిక్ దళ్, రాథారంగా మిత్రమండలి, త్రిశూల్ యోగశాల వాలంటీర్ల ఆధ్వర్యంలో ఏలూరులోని దాతలను నేరుగా కలిసి విరాళాలు సేకరించడం ప్రారంభించారు. డిజిటల్ మార్గంలో కూడా విరాళాలు సేకరించేందుకు శ్రీకారం చుట్టారు. ఇలా వివిధ మార్గాల ద్వారా మొత్తం రూ.14 లక్షలను విరాళాల రూపంలో సహృదయం కలిగిన దాతల నుంచి సేకరించిన ఆ ధనంతో పలు ఉపకరణ వస్తువులను కొలుగోలు చేసి, వాటిని విజయవాడలోని పలు ప్రాంతాల్లో

వాహనాలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

సుమారు వెయ్యి కుటుంబాలకు ఉపయుక్తమైన కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏలూరులోని జ్యూట్‌మిల్ వద్ద ఆదివారం మనవంత సాయం - ఫ్లీజ్ హెల్ప్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు అందించేందుకు సమకూర్చిన పరుపులు, గోడ గడియారాలు, దుప్పట్లు, ఇతర వస్తువులను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పరిశీలించారు. తొలుత త్రిశూలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, విజయవాడకు వివిధ వస్తువులతో తరలివెళ్లేందుకు సిద్ధమైన ఐదు లారీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన సేవలతోనే సమాజంలో సమున్నత విలువలను పెంపొందిస్తాయన్నారు. విపత్కర సమయంలో ఏలూరు నుంచి సంఘాలు, సంస్థల నుంచి ఇప్పటికే సుమారు రూ.కోటి విలువైన సేవలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఫ్లాష్ వినూత్న ఆలోచనలతో సుమారు రూ.14 లక్షలతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో సేవాదృక్పథాన్ని చాటడం కేవలం ఫ్లాష్‌కే సాధ్యమని అభినందించారు. భవిష్యత్‌లో ఫ్లాష్ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, ఫ్లాష్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ చింతమనేని సేవా దృక్పథం

సాంకేతిక లోపంతో నిలిచిన కోలాట బృందం వాహనం
డిసిఎం వ్యాన్‌లో స్వగ్రామానికి తరలించిన చింతమనేని
ఎంఎల్ఎకు మహిళలు, చిన్నారుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - దెందులూరు

జంగారెడ్డిగూడెం మండలం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం మొండూరు గ్రామానికి చెందిన సుమారు 50 మంది మహిళలు, చిన్నారులతో కూడిన భక్త బృందం పాల్గొని కోలాటం నిర్వహించారు. కోలాటం అనంతరం తిరిగి స్వగ్రామమైన మొండూరు వస్తుండగా కామవరపుకోట సమీపంలో వారు ప్రయాణిస్తున్న వ్యాన్ సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. రెండు గంటల సమయంపైగా వేచి చూసినా వారికి ప్రత్యామ్నాయం దొరకలేదు. అయితే అదే సమయంలో జంగారెడ్డిగూడెంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ రహదారిపై ఎండలో నిల్చున్న చిన్నారులను చూసి వెంటనే తమ వాహనాన్ని ఆపారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ, స్వయంగా వారికి చాక్లెట్లు అందించిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ వాహనం విషయం తెలుసుకుని రహదారిపై ఇబ్బంది పడుతున్న చిన్నారులను, మహిళలను వారి స్వగ్రామానికి తరలించేలా తక్షణమే ఏర్పాట్లు చేయాలని తన అనుచరులను ఆదేశించారు. ఆయన ఆదేశాలతో హుటాహుటిన డిసిఎం వ్యాన్‌ను రప్పించి చిన్నారులను, మహిళలను క్షేమంగా వారి స్వగ్రామం చేరేలా చర్యలు చేపట్టారు. కోలాటం బృందం తమ స్వగ్రామానికి క్షేమంగా చేరే వరకూ వారికి అండగా ఉండేలా తన అనుచరులను సైతం వారికి తోడుగా పంపించారు. ఈ సందర్భంగా తమ అవసరాన్ని గుర్తించి అడగకుండానే నేనున్నానంటూ అండగా నిలిచిన దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌కు చిన్నారులు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజాశక్తి - మండవల్లి

మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సర్పంచి పెరుమాళ్ల పద్మ స్పష్టం చేశారు. మండలంలోని పెరిగేగూడెం సచివాలయం పరిధిలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి చట్టం పనులపై ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ గ్రామసభలో 2023-24 సంవత్సరంలో నిర్వహించిన ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కూలికీ వంద రోజులు పని కల్పించాలనే లక్ష్యంతో జాతీయ ఉపాధి పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయన్నారు. పనులను సకాలంలో సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. సిబ్బంది కూడా అవినీతికి తావు లేకుండా కూలీలకు సకాలంలో పనులు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ నవీన్, కూటమి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజాదర్బార్'

ఏలూరుసిటీ: నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు నెలలో నాలుగు రోజులు ప్రజాదర్బారు పేరుతో సమస్యలు, వినతుల స్వీకరణకు శ్రీకారం చుట్టామని ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాల యంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏలూరులోని అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మొదటి ప్రజాదర్బార్ నిర్వహించనున్నామని తెలిపారు.

అద్భుతంగా టిడిపి కూటమి పరిపాలన

రెడ్డి అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గడిచిన వంద రోజుల పరిపాలన చాలా అద్భుతంగా ఉందని జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పంచాయతీ రాజ్ శాఖను సమర్థవంతంగా నడిపిస్తున్నార న్నారు. స్థానిక సంస్థలను ఏ విధంగా బలోపేతం చేయాలో అంతకన్నా రెట్టింపు ఉత్సాహంతో బలోపేతం చేస్తున్నారన్నారు. అభివృద్ధికి నోచుకోని ఆమడ దూరంలో ఉన్న గ్రామీణ పట్టణాలను సైతం అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రూ.1,250 కోట్లు సీసీ రోడ్ల నిర్మాణం నిమిత్తం విడుదల చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటున్నారన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సైతం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వాళ్లకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపుతున్నారన్నారు. రానున్న రోజుల్లోనూ తాము కలిసికట్టుగా పనిచేసి స్థానికంగా ఉన్న అనేక కమిటీల్లోనూ పార్టీ నాయకులను పెట్టి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపున పయనిస్తుందని, ఈ వంద రోజుల పరిపాలనే నిదర్శనమని తెలిపారు. ఇదే రకమైన ఒరవడినే భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని, జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి మీడియా ద్వారా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. మాజీ ఎంఎల్ఎ ఆళ్లనాని చేరికపై స్పందిస్తూ జనసేన పార్టీలోకి ఎవరైనా వస్తే తాము స్వాగతిస్తామన్నారు. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటే దానికి సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, లీగల్ సెల్ అధ్యక్షులు నిమ్మల జ్యోతికుమార్, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, వన్ టౌన్ మహిళ ప్రధాన కార్యదర్శి వెలగా గాయత్రి, నాయుడు పాల్గొన్నారు.

'రాహుల్ గాంధీపై పవన్ వ్యాఖ్యలు తగవు'

నూజివీడు టౌన్ : రాహుల్‌గాంధీపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు తగవని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన నూజివీడులో విలేకర్లతో మాట్లాడుతూ రాహుల్ గాంధీని విమర్శించే నైతిక విలువ పవన్‌కు లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలు ఓట్లు వేస్తేనే పవన్‌కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి అయ్యారనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు.

కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు

చిక్కుకున్న జంతు వ్యర్థాలతో దుర్గంధం
ఇబ్బందుల్లో స్థానికులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువలో నారాయణపురం వంతెన వద్ద గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయింది. దీంతో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడి ఎగువ ప్రాంతాల నుంచి జంతు కళేబరాలు కొట్టుకువచ్చి ఇక్కడ తూడులో చిక్కుకుపోవడంతో దుర్వాసనతో వాంతులు అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలువ గట్టు నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లిపోయిన జంతు వ్యర్థాలతో భరించలేని విధంగా దుర్గంధంతో కూడిన వాసనతో వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని అభయాంజనేయస్వామి ఆలయ నిర్వాపకులు బొబ్బిలి వెంకటరత్నం, నారాయణపురం వర్తక సంఘం సభ్యుడు చెన్నంశెట్టి చంద్రశేఖర్‌లు ఫిర్యాదు చేశారు. తూడును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఏలూరు కాలువలో నారాయణపురం వద్ద ఆగిపోయిన తూడు

కెఎస్.లక్ష్మణరావు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న వెంకయ్య

వెంకయ్యకు జిల్లా విశిష్ట విద్యా సేవా పురస్కారం

ప్రజాశక్తి - మండవల్లి

విశ్వ భారతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ బండారు వెంకయ్య జిల్లా విశిష్ట విద్యా సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో నిర్వహించిన వరల్డ్ టీచర్స్ డే సందర్భంగా జగ్గయ్యపేట ఎంఎల్ఎ రామ్‌గోపాల్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులను దేశానికి అందించడమే లక్ష్యంగా విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను నెలకొల్పి నిర్వహిస్తున్నామన్నారు. గత 37 ఏళ్లుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి అలుపెరుగని కృషి చేస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దామన్నారు. సొంత లాభానికి తావు లేకుండా రూరల్ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా విద్యాబోధన చేస్తున్న మా పాఠశాలను గుర్తించి తనకు జిల్లా విశిష్ట విద్యా సేవా పురస్కారాన్ని అందించడం అభినందనీయమన్నారు. అవార్డు అందించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

'దళితులంతా ఐకమత్యంగా ఉండాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

దళితులంతా ఐక్యమత్యంగా ఉండి దళితులపై జరిగే దాడులు, అన్యాయాలపై పోరాటం చేయాలని పలువురు దళిత నాయకులు అన్నారు. మండల కేంద్రమైన ముదినేపల్లిలో ఆదివారం సాయంత్రం దళితుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ దళితులంతా ఒకే తాటిపైకి వచ్చి పార్టీలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. దళితులందరూ సోదర భావంతో ఉండాలని, దళితుడు అనే వానికి ఏ ఒక్కరికీ అన్యాయం జరిగిన అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. ఒకరికి ఒకరు అండగా ఉండి దళితుల సత్తా ఏంటో చూపించాలన్నారు. ఈ దళిత ఆత్మీయ సమ్మేళనంలో దళిత నాయకులు నిమ్మగడ్డ బిక్షాలు, బేతపూడి వెంకటరమణ, కోటే ప్రవీణ్ బాబు, భూపతి రవీంద్ర, లేళ్ల ఆంజనేయులు, అర్జా కిషోర్, ఎం.సమూయేలు, సుధాకర్, తాడంకి ఏసుపాదం పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేరాలు - ఘోరాలు

అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్
రూ.40 లక్షలు పోగొట్టుకున్న మహిళ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ముంబై పోలీస్‌డిపార్ట్‌మెంట్ నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి ఓ మహిళ వద్ద మూడు విడతల్లో రూ.40 కాజేశారు. బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఉషాబాలా నగర్‌కు చెందిన ఓ మహిళకు ఈనెల రెండో తేదీ మధ్యాహ్నం మరో మహిళ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ముంబై పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామని, మీ కోసం పార్శిల్ వచ్చిందని, అందులో ఎండిఎంఎ అనే చట్ట విరుద్ధమైన డ్రగ్స్ ఉన్నాయని, వీటిని విచారించాలంటే రూ.40 లక్షలు అకౌంట్లో వేయాలని, విచారణలో నిర్దోషి అని తేలితే మీ డబ్బులు మీకు వెనక్కు చెల్లిస్తామని నమ్మబలికారు. దీంతో ఆ మహిళ రూ.40 లక్షలు మూడు విడతల్లో వారికి బదిలీ చేసింది. బదిలీ చేసిన తర్వాత ఫోన్ నెంబర్ పనిచేయటం ఆగిపోయిందని గ్రహించిన మహిళ బంధువుల సలహా మేరకు నూజివీడు పట్టణ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

గుర్తు తెలియని వాహనం ఢీకొని భిక్షాటన చేస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకటాపురం శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. భిక్షాటన చేసే వ్యక్తిని వెంకటాపురం శివారులో శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో గుర్తు తెలీని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆ వ్యక్తిని స్థానికులు 108 అంబులెన్స్‌లో బూర్గంపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. మృతుని వివరాలు తెలిసినవారు కుక్కునూరు పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఫ్యాక్టరీలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ సంబంధిత ఫ్యాక్టరీలో పని చేస్తున్న యువకుడు గాయాలపాలయ్యాడు. వివరాల ప్రకారం.. మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన దళితుడు కోన రాజేష్ కొంతకాలం నుంచి గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్ పరిధిలో ఉన్న పొగాకు దుత్తల కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఫ్యాక్టరీలో పని చేస్తున్న సమయంలో కాలు పాదం భాగం మిషన్లో పడి పూర్తిగా నలిగి నుజ్జునుజ్జు అయింది. రాజేష్‌ను కుటుంసభ్యులు పెద అవుటపల్లి వద్ద పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. అనంరతం అక్కడి నుంచి తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పోతునూరులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ కుటుంబరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.ఐదు వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

మందుగుండు సామగ్రి పట్టివేత

ప్రజాశక్తి -ముదినేపల్లి

లైసెన్స్ లేకుండా అక్రమంగా దీపావళి మందు గుండు సామగ్రి కలిగిన ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపారు. ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ తన సిబ్బందితో రాబోవు దీపావళి పండుగను పురస్కరించుకుని అక్రమంగా బాణసంచా సామగ్రిని కలిగి ఉన్న వారిపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముదినేపల్లికి చెందిన కంచర్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి గురజ రోడ్డులోని తన బియ్యం దుకాణంలో సుమారు రూ.45 వేల విలువైన ఫైర్ క్రాకర్స్ అక్రమంగా కలిగి ఉండడం గుర్తించారు. సదరు కంచర్ల శ్రీనివాసరావును అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌కుమార్ తెలిపారు.

చింతలపూడి :అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి గ్రామంలో బస్టాండ్ పక్కగా ఉన్న దుకాణంలో పోలీసులు ఆదివారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.15 వేల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

చట్టాలపై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.పురుషోత్తంకుమార్ అన్నారు. చింతలపూడి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మహిళల హక్కులు, వరకట్న వేధింపులు, మానవ అక్రమ రవాణా, దాడులు, ఆస్తి హక్కు తదితర చట్టాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.పురుషోత్తంకుమార్ మాట్లాడుతూ మహిళల రక్షణకు చట్టాలు చాలా ఉన్నాయన్నారు. వాటిని తెలుసుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. మహిళలకు అన్యాయం జరిగితే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సలహాలు ఇవ్వడం కాకుండా వారికి ఉచితంగా న్యాయ వాదిని ఏర్పాటు చేస్తారన్నారు. విధాన్ సే సమాధాన్ అంటే చట్టం ద్వారా పరిష్కారమని, చట్టం దాని అమలుకు ఉన్న మార్గాలు మహిళలు తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గృహహింస, మనోవర్తి కేసులు ఎక్కువగా వింటూ ఉంటామని, వాటి గురించి పూర్తిగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం చింతలపూడి సబ్ జైల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు, డిఎస్‌పి యు.రవిచంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ డి.పావని, ఐసిడిఎస్ పిఒ మాధవి పాల్గొన్నారు. సభ వ్యాఖ్యాతగా సోషల్ వర్కర్ ఎండి.అక్బర్‌అలి, సిఐ రవీంద్రనాయక్, సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం పాల్గొన్నారు.

ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులకు, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఎంపిక చేసిన ఇద్దరు వార్డు సభ్యులకు ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజులు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో గ్రామ పంచాయతీల్లో సాధారణ కనీస పరిపాలన విధానం ఎపిపిఆర్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు తదితర పది అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

శాలివాహనుల అభ్యున్నతికి సీతారామయ్య కృషి

మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

శాలివాహనుల అభ్యున్నతికి, వైసిపి ప్రతిష్టతకు కీర్తిశేషులు బిసిసెల్ నాయకులు గొలిశెట్టి సీతారామయ్య కృషి మరువలేనిదని మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నా రు. సీతారామయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదివారం బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ సౌమ్యుడిగా ఉంటూ సీతారామయ్య జిల్లాలోని శాలివాహనులను కలుపుకొని సంఘ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. అదే సమయంలో వైసిపికి సేవలందిస్తూ అందరి మన్ననలు అందుకున్నారని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఐటిడిఎ కోటరామచంద్రాపురం పరిధిలోని బుట్టాయగూడెం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి పిజిటి లెక్కలు, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ టీచర్స్‌గా పని చేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్న రిటైర్డ్ టీచర్స్, ఆయా సబ్జెక్టులకు సంబంధించిన విద్యార్హతలు కలిగి ఉన్న వారి నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఐటిడిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ అధికారి పి.ధాత్రిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను కార్యాలయం ప్రధానాచార్యులు, బుట్టాయగూడెం ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్, విప్పలపాడులో ఇమెయిల emrsbuttayagudem@gmail.com ద్వారా ఈ నెల 16వ తేదీలోగా అందించాలన్నారు. పూర్తి వివరాలకు బుట్టాయగూడెం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో, 9412102600, 9492348214, 9492508225 సంప్రదించాలని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఆగిరిపల్లి :స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఎస్ఐ కె.శుభశేఖర్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసి తెలియక శాంతి భద్రతలకు విఘాతం కల్గించి రౌడీషీట్ ఓపెన్ చేయించుకున్నవారు చెడు ప్రవర్తనను వదిలి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

CHANGE OF NAME

I, GADIRAJU. VENKATA SEETA RAMA KRISHNAM RAJU (New Name) S/o Gadiraju Surpa Raju Previously called GADIRAJU. RAMA KRISHNAM RAJU, Resident of Flat No.301, Sainadh Appartment, Steamer Road, Near Tailor High School, Narasapuram, West Godavari District, Andhra Pradesh, Pin code.534275, stating that, now changed my name from GADIRAJU. RAMA KRISHNAM RAJU (Old Name) to GADIRAJU. VENKATA SEETA RAMA KRISHNAM RAJU (New Name).
Today onwards all my documents (Passport etc.,) and correspondence will continue with my new name GADIRAJU. VENKATA SEETA RAMA KRISHNAM RAJU